## నకిలీ విత్తనాలపై ఉక్కు పాదం

- బోధన సామర్థ్యాన్ని పెంచడానికి శిక్షణ
- కలెక్టర్ రాహుల్ రాజ్




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, మే 23(నమస్తే తెలంగాణ): నకిలీ విత్తనాలపై ఉక్కు పాదం మోపేందుకు టాస్క్ ఫోర్స్ బృందాల షురూ చేసినట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ హాల్‌లో పోలీస్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వానకాలం సీజన్‌లో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై టాస్క్ ఫోర్స్ జాయింట్ సమన్వయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని వానకాలం ప్రారంభానికి ముందు క్షేత్రస్థాయిలో టాస్కఫోర్స్ బృందాలు ఏర్పాటు చేసి, విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. సర్టిఫికెట్, కంపెనీ లైసెన్స్, విత్తనాల నాణ్యత, నియమ నిబంధనలను పరిశీలించాలన్నారు. ఏ ఒక్కటి లేకపోయినా పోలీస్ యంత్రాంగం కేసులు నమోదు చేయాలన్నారు. సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉంచుకోవాలని, రైతులు దళారులను నమ్మి నకిలీ విత్తనాలు కొని మోసపోకుండా చూడాల్సిన బాధ్యత పోలీస్, వ్యవసాయ శాఖల దేనిని వివరించారు. అనంతరం అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలను అడ్డుకట్ట వేసేందుకు వ్యవసాయ శాఖతో సమన్వయంతో పని చేస్తామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నగేశ్, జిల్లా వ్యవసాయ అధికారి వినయ్, మండల వ్యవసాయ అధికారులు, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

### పాపన్నపేటలో..

పాపన్నపేట, మే 23: ఉపాధ్యాయుల బోధన సామర్థ్యాన్ని పెంచేందుకే శిక్షణ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. డీఈవో రాధాకిషన్‌తో కలిసి పాపన్నపేటలో నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులకు శిక్షణ, వృత్తి నైపుణ్యాల పెంపు, ఒకటి నుంచి 5 తరగతి వరకు విద్యార్థులకు ప్రాథమిక స్థాయి గుణాత్మక విద్య అందించేందుకు ఈ శిక్షణ దోహదపడుతుందన్నారు. తాజా విద్యా పరిణామాలతో ముందుకుపోవాలన్నారు. కొత్త బోధనా పద్ధతులను ప్రవేశపెట్టడానికి, వృత్తిపరమైన స్థిరత్వం పెంచడానికేనన్నారు. కలెక్టర్ వెంట అకాడమిక్ మానిటరింగ్ అధికారి సుదర్శన్‌మూర్తి, ఎంఈవో ప్రతాప్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్లు పాల్గొన్నారు.

## హక్కుల సాధనలో డీబీఎఫ్ పాత్ర అభినందనీయం

రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మాట్లాడుతున్న ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

నిజాంపేట, మే23: దళిత హక్కుల సాధనలో డీబీఎఫ్ పాత్ర అభినందనీయమని రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. నిజాంపేటలో డీబీఎఫ్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాజ్యాంగ హక్కులు, చట్టాలు, నాయకత్వ లక్షణాలపై శిక్షణ శిబిరంలో బక్కి వెంకటయ్య పాల్గొని మాట్లాడారు. ప్రశ్నిస్తేనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం చేస్తే న్యాయం జరిగేలా కృషి చేస్తానన్నారు. డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్,జిల్లా అధ్యక్షుడు సంజీవ్,మాజీ సర్పంచ్ జీడి రవి,మాజీ ఉపసర్పంచ్ కొమ్మాట బాబు,ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మాల మహానాడు సభ్యుడు ఎల్లం, శంకర్, చంద్రం, రాజయ్య, బాలయ్య, బుచ్చయ్య తదితరులు ఉన్నారు.

## మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

మెదక్ మున్సిపాలిటీ, మే 23: తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఉమాదేవి ప్రకటనలో తెలిపారు. డిగ్రీ కళాశాల 'న్యాక్ ఏ గ్రేడ్' పొందిందన్నారు. కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూప్‌ల్లో పలు కోర్సుల్లో సీట్లు ఉన్నాయని, ఆసక్తి గల విద్యార్థినులు ప్రవేశాలు పొందాలని సూచించారు.


## గో రక్ష చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి



సీఐకి వినతి పత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ నాయకులు

రామాయంపేట మే 23: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గో రక్ష చట్టాన్ని కఠినంగా అమలుచేయాలని వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం రామాయంపేట సీఐ వెంకటరాజగౌడ్, తహసీల్దార్ రజనీకుమారికి వినతి పత్రాలు అందజేశారు. గో సంరక్షణ కోసం జిల్లాలో పది ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సురేశ్, మాణిక నాంపల్లి, భాగయ్య, అభి, గిరి, నర్సింహులు తదితరులు ఉన్నారు.

## ఆపరేషన్ సిందూర్‌కు ఉపాధ్యాయుల మద్దతు




మెదక్ మున్సిపాలిటీ, మే 23: ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా డైట్ కళాశాలలో శిక్షణ పొందుతున్న ప్రభుత్వ ఉపాధ్యాయులు జాతీయ జెండాలు ప్రదర్శిస్తూ ఉగ్రదాడుల్లో అమరులైన వారికి నివాళులర్పించారు. ప్రదర్శనలో ఉపాధ్యాయులు భాస్కర్, యాదగిరి, లక్ష్మణ్, దత్తాత్రేయ కులకర్ణి, దేశపతి, నాగులు, సునీత, సుకన్య, కవిత, సరస్వతి తదితరులు పాలన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలి

కౌడిపల్లి, మే23: విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలని డీఈవో రాధకిషన్ అన్నారు. శుక్రవారం కౌడిపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని పరిశీలించారు. సెలవుల్లో ముందుగానే టీచింగ్ ప్లాన్ తయారు చేసుకోవాలన్నారు. ఎంఈవో బాల్‌రాజ్, కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఆర్పీలు రమేశ్, మహిపాల్, మహేశ్, గోవింద్, స్రవంతి ,మల్లేశం పాల్గొన్నారు.

## అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించాలని ఆందోళన



తూప్రాన్, మే 23: మున్సిపల్‌లోని 12వ వార్డు హైదర్ గూడలో మురుగు కాల్వలు అధ్వానంగా మారాయని, నిధులు మంజూరైనా నిర్మించడం లేదని శుక్రవారం మహిళలు ఆందోళన చేశారు. గతంలో కొలతలు చేసిన అధికారులు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు.

# ఆలయాలకు పెద్దపీట వేసింది కేసీఆరే

- తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలి
- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి
- కోనాపూర్‌లో పెద్దమ్మ వార్షికోత్సవాలు, లాక్య తండాలో సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠకు హాజరు



రామాయంపేట: కోనాపూర్‌లో పెద్దమ్మ కల్యాణానికి హాజరై, పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే



పాపన్నపేట: నాగసాన్‌పల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

రామాయంపేట, మే 23: రాష్ట్రంలో ఆలయాలకు పెద్దపీట వేసింది బీఆర్‌ఎస్ అధినేత కేసీఆరేనని మెదక్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కోనాపూర్‌లో పెద్దమ్మ కల్యాణానికి విచ్చేసి పూజలు చేశారు. అక్కడి నుంచి నేరుగా పర్వతాపూర్ లాక్య తండాకు వెళ్లి, సేవాలాల్ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక నిధులు వెచ్చించి గ్రామీణ ప్రాంతాల్లోని ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిన ఘనత కూడా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌దేనన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల పేరిట జనాలను నిండా ముంచుతున్నదన్నారు. ఒక్క గ్యారంటీ కూడా అమలుకాకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్‌ఎస్ నేతృత్వంలోనే మెదక్ నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపిందన్నారు. రాబోయే కాలం బీఆర్‌ఎస్‌దేనని, స్థానిక సంస్థల్లో బీఆర్‌ఎస్ నాయకులకే పట్టం కడతారన్నారు. ఆమె వెంట పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, మాజీ సర్పంచ్ సుభాష్ రాథోడ్, ఉమామహేశ్వర్ ఉన్నారు.

### కొనుగోలు కేంద్రం పరిశీలన

పాపన్నపేట, మే 23: అకాల వర్షాలకు వరి పంట పెద్ద ఎత్తున దెబ్బతిందని, తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, కలెక్టర్‌కు, సంబంధిత అధికారులకు కోరారు. మండలంలోని నాగసాన్‌పల్లిలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. పెద్ద ఎత్తున మొలకలు రావడంతో వెంటనే కలెక్టర్‌కు ఫోన్ చేశారు. లారీలు రావడానికి ఆలస్యమైతే, ట్రాక్టర్ల ద్వారా ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలని సూచించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొన్నామని వెల్లడించారు. రైతులకు ఇబ్బందులు రాకుండా చూశామన్నారు. నాగసాన్‌పల్లిలో రెండు కొనుగోలు కేంద్రాలు ఉన్నప్పటికీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆమె వెంట పార్టీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకటరామిరెడ్డి, జిల్లా నాయకుడు సోములు ఉన్నారు.

# ఇంకా ధాన్యం ఎన్ని రోజులు ఉంచాలి ?



చిలిపిచెడ్: చిట్కుల్ కొనుగోలు కేంద్రంలో మొలకెత్తిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు



చేగుంట: చందాయిపేట కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీకాంత్



రామాయంపేట: కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యం బస్తాలను తరలిస్తున్న తహసీల్దార్

చిలిపిచెడ్, మే 23: వర్షాలు కురుస్తున్నందున కేంద్రంలో ధాన్యం ఇంకా ఎన్ని రోజులు ఉంచాలి.. ఇప్పటికే ధాన్యం తడిసి మొతకెత్తుతున్నది. మా ధాన్యం తీసుకుపోతారా లేదా అని రైతులు మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చిట్కుల్, చండూర్, చిలిపిచెడ్ గ్రామాల్లోని ఐకేపీ కేంద్రాల్లో నెల రోజుల నుంచి ధాన్యం కుప్పలుగా పోశామని, కాంటా కోసం వేచి చూస్తున్నామని రైతులు పేర్కొంటున్నారు. తూకం కావడం లేదని, లారీలు సరిగా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రెండుసార్లు ధాన్యం తడిసిందని రైతులు తెలిపారు. కొనుగోళ్లు వేగంగా చేస్తేనే తమకు న్యాయం జరుగుతుందని, అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

### వేగంగా కొనుగోళ్లు జరగాలి

రామాయంపేట, మే 23: ధాన్యం కొనుగోళ్లు వేగంగా జరగాలి లేకుంటే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రజినీకుమారి హెచ్చరించారు. అక్కన్నపేటలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం సకాలంలో తరలించకుండా ఏం చేస్తున్నారని సిబ్బందిపై మండిపడ్డారు. తూకం వేసిన ధాన్యాన్ని లారీల్లో రైస్‌మిల్‌కు తరలించకుండా కాలయాపన ఎందుకు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

### తడిసిన ధాన్యం పరిశీలన

పెద్దశంకరంపేట, మే 23: పెద్దశంకరంపేటలో గురువారం రాత్రి నుంచి భారీ వర్షం కురిసింది. ఆయా గ్రామాల్లో ధాన్యం తడవడంతో తహసీల్దార్ శ్రీనివాస్ కొనుగోలు కేంద్రాలకు వెళ్లి పరిశీలించారు.

### ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలి

చేగుంట, మే 23: ధాన్యం కొనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలని తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. మండలంలోని చందాయిపేట్, మక్కరాజిపేట్, వడియారం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించారు. మండలంలో 27 సెంటర్లకుగాను 23 సెంటర్లలో ధాన్యం కొనుగోలు పూర్తయ్యిందన్నారు. నాలుగు సెంటర్లలోధాన్యాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఆర్ఐ సంతోష్‌కుమార్, వెల్దుర్తి సెంటర్ ఇన్‌చార్జిలున్నారు.

## వివాహేతర సంబంధమే హత్యకు దారితీసింది

- బంగారు నగల కోసం ప్రియురాలి హత్య
- రామాయంపేట సీఐ.వెంకటరాజగౌడ్



నిందితుడిని ప్రవేశపెట్టిన సీఐ వెంకటరాజగౌడ్

రామాయంపేట, మే 23: మహిళపై ఉన్న బంగారమే హత్యకు దారితీసిందని సీఐ వెంకటరాజగౌడ్ అన్నారు. నిందితుడిని రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో విలేకరుల ఎదుట శుక్రవారం ప్రవేశపెట్టారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా గాంధారి మండలం గుర్జాల గ్రామానికి చెందిన దివ్యాంగురాలు బ్యాగరి మణెమ్మ (40)తో పక్కనే ఉన్న రామలక్ష్మణపల్లికి చెందిన కొండని రవీందర్‌కు కొంతకాలంగా పరిచయం ఏర్పడింది. అది కాస్త వివాహేతర సంబంధానికి దారితీసింది. కొన్ని రోజుల క్రితం మణెమ్మ తన కూతురి పెండ్లి చేసింది. అప్పుడు ఆమె పెట్టుకున్న బంగారంపై రవీందర్ కన్ను ప డింది. దీంతో ఆమెను కామారెడ్డికి రమ్మని తెలిపాడు. కామారెడ్డికి వచ్చిన తర్వాత యాదగిరిగుట్టకు వెళ్దామని చెప్పడం తో మణెమ్మ ఒప్పుకుని కారెక్కింది. కారులో గజ్వేల్ వరకు వెళ్లారు. అక్కడ మణెమ్మను చంపుదామనుకున్నా డు. అక్కడ కుదరక పోవడంతో అక్కడి నుంచి నేరుగా మెదక్ జిల్లా తొనిగండ్ల అటవీ ప్రాంతానికి చేరుకుని కారును నిలిపేశాడు. తాను అనుకున్న పథకం ప్రకారం మణెమ్మను ఆమె మెడలోని చున్నితో చుట్టి బలంగా లాగాడు. అంతటితో ఆగకుండా తన కారులో ఉన్న దిండును ఆమె ముఖంపై పెట్టి బలంగా ఒత్తిపట్టి చంపేశాడు. ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాలను తీసుకుని వెళ్తున్న అతడికి అనుమానం వచ్చింది. కారు ఆపి ఓ బండరాయితో మృతురాలు తలపై మోది అక్కడి నుంచి జారుకున్నాడు. పది రోజులుగా మణెమ్మ జాడ దొరకలేదు. ఆమెను ఎవరు తీసుకెళ్లారనే తమదైన కోణంలో పరిశీలించగా మృతురాలిని చంపింది రామలక్ష్మణపల్లికి చెందిన రవీందర్‌గా గుర్తించినట్లు సీఐ పేర్కొన్నారు. నిందితుడు తన గ్రామం నుంచి కారులో బంగారు ఆభరణాలు తీసుకుని కామారెడ్డిలో అమ్మడం కోసం బయలుదేరుతుండగా, గ్రామ పెద్దవాగు వద్ద నేడు తమ సిబ్బందికి పట్టుబడ్డట్లు సీఐ తెలిపారు. నిందితుడి వద్ద ఉన్న మృతురాలి బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపుతున్నట్లు చెప్పారు. పది రోజుల్లో తమ సిబ్బంది కేసును ఛేదించినట్లు సీఐ తెలిపారు.

## ప్రభుత్వ పథకాల అమలులో రాజకీయ జోక్యాన్ని నివారించాలి

-సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య



సమావేశంలో మాట్లాడుతున్న అడివయ్య

మెదక్ మున్సిపాలిటీ, మే 23: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువవికాసం పథకాల్లో రాజకీయ జోక్యాన్ని అరికట్టాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని కేవల్ కిషన్ భవన్‌లో సీపీఎం మెదక్ ఏరియా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యంతో అన్యాయం చేస్తే ఆందోళనలు చేస్తామన్నారు. కాంగ్రెస్ ఇన్‌చార్జిలు సూచించిన వారికే ప్రభుత్వ పథకాలు ఇవ్వాలనే ఆలోచన సరైంది కాదన్నారు. నిధులు లేవంటూనే అందాల పోటీలకు కోట్లాది రూపాయలు ఎందుకు ఖర్చు చేస్తున్నారని ప్రశ్నించారు. కల్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం ఏమైందన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా మెదక్ ఏరియా కమిటీ కన్వీనర్ మల్లేశం, కమిటీ సభ్యులు సంతోష్, అజయ్, యశోద, లచ్చాగౌడ్, నాగమణి, కవిత, యాదగిరి షౌకత్ పాల్గొన్నారు.

## మృతదేహంతో నిందితుడి ఇంటి ఎదుట ఆందోళన



నిందితుడి ఇంటి ఎదుట రమేశ్ మృతదేహంతో ఆందోళన చేస్తున్న బంధువులు

కొల్చారం, మే 23: కారు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. యువకుడి మృతదేహంతో నిందితుడి ఇంటి ఎదుట బాధిత కుటుంబీకులు ఆందోళన చేశారు. ఈ నెల 13న మండలంలోని రాజిపేటకు చెందిన తోళ్ల రమేశ్ (21) తన మిత్రుడితో కలిసి రాజిపేట నుంచి నర్సాపూర్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. గ్రామ శివారుకు చేరుకోగానే కొల్చారం గ్రామానికి చెందిన దేవన్నగారి వేణుమాధవ్ తన కారును అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వచ్చి ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై వెళ్తున్న యువకులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్ నారాయణ ఆసుపత్రిలో చేర్పించారు. తోళ్ల రమేశ్ పరిస్థితి విషమించడంతో గాంధీకి తరలించారు. గాంధీలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో రమేశ్ మృతిచెందాడు. దీంతో మృతుడి కుటుంబీకులు మృతదేహంతో శుక్రవారం వేణుమాధవ్ ఇంటికి చేరుకుని న్యాయం చేయాలంటూ ఆందోళన చేశారు. విషయం తెలుసుకున్న కొల్చారం ఎస్ మహమ్మద్ గౌస్, కౌడిపల్లి ఎస్ఐ రంజిత్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. నిందితులను పిలిపించి న్యాయం చేయాలని బాధితులు పట్టుబట్టారు. నిందితుడు వేణుమాధవ్ సైతం బ్రెయిన్ స్ట్రోక్‌తో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని తెలిపి, వేణుమాధవ్ బంధువులతో ఫోన్‌లో మాట్లాడించారు. దీంతో బాధితులు అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## పాపన్నపేట శివారులో చిరుత సంచారం




చిరుత పాదాల ఆనవాళ్లు

చిరుత పాదాల ఆనవాళ్లను పరిశీలిస్తున్న రైతులు



పాపన్నపేట, మే 23: పాపన్నపేట శివారులో చిరుత సంచరిస్తుండడంతో రైతులు భయం గుప్పిట్లో కాలం వెళ్లదీస్తున్నారు. పాపన్నపేట శివారులో వేంకటేశ్వరగుట్ట సమీపంలో గత రాత్రి చిరుత సంచరించిన ఆనవాళ్లు ఉన్నట్లు రైతులు గుర్తించారు. నెల రోజుల క్రితం గుట్ట అవతల వైపు ఉన్న దౌలాపూర్ శివారులో రెండు చిరుతలు సంచరించాయి. అప్పట్లో ఫారెస్టు అధికారులు సైతం ధ్రువీకరించారు. అక్కడికి ఎవరూ వెళ్లొద్దని రైతులకు సూచించిన విషయం తెలిసిందే. శుక్రవారం తెల్లవారు జామున వేంకటేశ్వరగుట్ట వైపు పొలాలు సాగు చేసిన రైతులు వెళ్లేసరికి చిరుతల పాదాల ఆనవాళ్లు కనిపించినట్లు రైతులు తెలిపారు. దీంతో పొలాల వైపు వెళ్లడానికి జంకుతున్నారు. ఒకటి తల్లి చిరుత, రెండోది పిల్ల చిరుత ఉన్నట్లు పాదముద్రలను బట్టి తెలుస్తున్నది. కొన్ని రోజుల క్రితం దౌలాపూర్, పాపన్నపేట గ్రామాల శివారులో చిరుత సంచరించడతంతో అప్పటి నుంచి ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని పొలాల వద్దకు వెళ్తున్నామని రైతులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి చిరుతను బంధించాల్సిందిగా కోరుతున్నారు. ఈ విషయమై జిల్లా ఫారెస్టు అధికారి జోజి వివరణ కోరగా రైతులు చిరుతగా భావిస్తున్నారని, మన ప్రాంతంలో ఎక్కడా లేదని, పాపన్నపేట శివారులో సంచరించిన పాదముద్రలను బట్టి చిరుత అయి ఉంటుందని వివరణ ఇచ్చారు. తమ సిబ్బందిని వెంటనే సంబంధిత ప్రాంతానికి పంపుతామని, రైతులు భయపడాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

## సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి



నర్సాపూర్‌లో ఉపాధ్యాయులకు అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ దేవదాస్

నర్సాపూర్, మే23: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని షీ టీమ్ హెడ్ కానిస్టేబుల్ దేవదాస్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం పట్టణంలో ఉపాధ్యాయ శిక్షణలో భాగంగా సైబర్ క్రైమ్ గురించి సలహాలు, సూచనలు అందజేశారు. సోషల్ మీడియాలో వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని, వాటితో ఖాతాలోని డబ్బులను సైబర్ నేరగాళ్లు కొల్లగొట్టే అవకాశాలున్నాయని ఆయన తెలిపారు. సైబర్ నేరాలపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో తారాసింగ్, కానిస్టేబుళ్లు గంగమణి, శంకర్, ఆర్పీలు సంతోష్‌కుమార్, అప్పలనాయుడు, కళారాములు, సునీత, శ్రీనివాస్, శివకుమార్, సీఆర్పీలు సుజాత, విశ్వకాంత్, గోపాల్‌చారి పాల్గొన్నారు.

## నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం

నర్సాపూర్, మే23: మున్సిపల్ పరిధిలో నేడు తాగునీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి జిల్లా బోర్పట్ల సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు జరుగుతున్నందున నీటి సరఫరా నిలిచిపోతుందన్నారు.

## మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పిస్తాం

మెదక్ అర్బన్, మే23: ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని మెదక్ ఆర్టీసీ డిపో డీఎం తెలిపారు. శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన సమస్యలను పరిష్కరించి ప్రయాణికులకు మెరుగైన ప్రయాణం అందించేలా కృషి చేస్తామని పేర్కొన్నారు.

## కొనసాగుతున్న సప్లిమెంటరీ పరీక్షలు

మెదక్ మున్సిపాలిటీ, మే 23: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం ఇంగ్లిష్ పరీక్షకు 802 మందికి 738 హాజరైనట్లు ఇంటర్ నోడల్ అధికారిణి మాధవి తెలిపారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ పరీక్షకు 259 మందికి 232 మంది హాజరైనట్లు పేర్కొన్నారు.

## అక్రమాలకు పాల్పడిన వీవోఏ తొలిగింపు

శివ్వంపేట, మే 23: గుండ్లపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో అక్రమాలకు పాల్పడిన వీవోఏ చంద్రకళను తొలిగించినట్లు డీఆర్డీవో ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న రైతులు వీవోఏపై చేసిన ఆరోపణలపై జిల్లా ప్రాజెక్టు అధికారి, ఐకేపీ ఏపీఎంలు విచారణ చేయగా, అక్రమాలకు పాల్పడినట్టు తేలిందని, దీంతో వీవోఏను తొలిగించాలని ఏపీఎంను ఆదేశించారు.

## పరిస్థితి విషమించి ఒకరు మృతి



నర్సింహులు (ఫైల్)

రామాయంపేట, మే 23: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలై, చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందిన ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. రామాయంపేటకు చెందిన తండ్రీకొడుకులు వారం రోజుల క్రితం బైక్ మీద చేగుంట వెళ్లే దారిలో మాసాయిపేట జాతీయ రహదారిలో ఓ ట్రాక్టర్ ఢీకొట్టింది. దేశాయిపేట నర్సింహులు (70) కోమాలోకి వెళ్లాడు. దీంతో నిమ్స్ దవాఖానకు తరలించారు. శుక్రవారం నర్సింహులు మృతి చెందాడు. మృతదేహాన్ని రామాయంపేటకు తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడి పెద్ద కొడుకు నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. కేసును చేగుంట పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి



ఇందిరమ్మ ఇంటిని పరిశీలిస్తున్న డీఈ మాణిక్యం చౌహాన్

రేగోడ్, మే 23: ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేయాలని పీడీ మాణిక్యం చౌహాన్ కాంట్రాక్టర్‌కు సూచించారు. శుక్రవారం ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి మాట్లాడారు. లబ్ధిదారులు 40 గజాలు లేదా 60 గజాల స్థలంలోనే ఇల్లు నిర్మించుకోవాలన్నారు. ఆయన వెంట డీఈ యాదగిరి, ఏఈ ప్రియాంక పాల్గొన్నారు.

## మురుగు కాల్వలా సీసీ రోడ్డు



చిలిపిచెడ్, మే 23: చిట్కుల్ ప్రధాన రోడ్డు అధ్వానంగా మారింది. వర్షాలకు రోడ్డు బురదమయంగా తయారవడంతో ప్రయాణానికి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ కార్యదర్శికి, అధికారులకు ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోయారు.

## ఫార్మర్‌గా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి



నిజాంపేట, మే 23: ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఏవో సోమలింగారెడ్డి సూచించారు. శుక్రవారం నిజాంపేట రైతువేదికలో రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రతి రైతుకు 11 అంకెల నంబర్ వస్తుందని, కేంద్రం అందించే పథకాలు నేరుగా రైతులకు చేరుతాయని తెలిపారు. పట్టా పాసుబుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లను క్లస్టర్ల వారీగా ఏఈవోలకు అందజేయాలన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



నిజాంపేట, మే23: నార్లపూర్‌కు చెందిన సంగు తిరుపతికి రూ.32 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కు మంజూరైంది. మాజీ సర్పంచ్ అమరసేనారెడ్డి బాధితుడికి శుక్రవారం చెక్కు అందజేశారు.

## మండల మహిళా సమైఖ్య అధ్యక్షురాలిగా లావణ్య



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న ఐకేపీ సిబ్బంది

చేగుంట, మే 23: చేగుంట మండల మహిళా సమైఖ్య నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఎన్నికల ఇన్‌చార్జి వెంకటస్వామి, డీఎంజీ లాలు, ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మ అధ్యక్షతన, అధ్యక్షురాలు సునీత, వరలక్ష్మి ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా చందాయిపేటకు చెందిన రాపోల్ లావణ్య, బీ కొండపూర్‌కు చెందిన బి స్వప్న, కోశాధికారిగా ఇబ్రహీంపూర్‌కు చెందిన ఎర్ర రేణుక ఎన్నికయ్యారు. సీసీలు రామస్వామి, స్వామి, అంజ్యానాయక్, శ్వేత, మమత పాల్గొన్నారు.